సాక్షి నిర్మల్

శుక్రవారం | 17 | అక్టోబర్ | 2025



విప్లవోద్యమం ఇక చరిత్రే!
విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్, లొంగుబాటతో ఇక చరిత్రగా మారిపోనుంది. IIలో▸



చిగురిస్తున్న ఆశలు..
ఎత్తిపోతల పథకాల నిర్వహణ సరిగా లేక పలు చోట్ల వృథాగా మారాయి. తాజాగా ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో ఆశలు చిగురిస్తున్నాయి. IIIలో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 32.2 /23.3
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ కార్యక్రమాలపై రైతులను చైతన్యపర్చాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు

భైంసారూరల్: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై వ్యవసాధికారులు రైతులను చైతన్యపర్చాలని రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి సురేంద్రమోహన్ అన్నారు. మండలంలోని వానల్‌పాడ్ రైతువేదికలో గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయాధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కపాస్ కిసాన్ యాప్, పంట వివరాల నమోదు, ఫార్మర్ రిజిస్ట్రేషన్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి తదితరాలపై సూచనలు చేశారు. ఏడీఏ వీణ, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

నేడు బాసరకు శృంగేరి పీఠాధిపతి

బాసర: విజయ యాత్రలో భాగంగా శృంగేరి పీఠాధిపతి, జగద్గురువు విదుశేఖర భారతి మహాస్వామి శుక్రవారం బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి రానున్నారు. సాధారణ అక్షరాభ్యాస మండపంలో భక్తులకు ప్రవచనాలను తెలియజేస్తారు. అనంతరం చంద్రమౌళీశ్వర మహాపూజ చేస్తారు. శనివారం జ్ఞాన సరస్వతి అమ్మవారికి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం ప్రసాద వితరణ ఉంటాయని ఈవో అంజనాదేవి తెలిపారు.

దీపావళికి ప్రత్యేక పూజలు...
బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానంలో దీపావళి సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి ఆలయ అర్చక వైదిక బృందం ఆధ్వర్యంలో విశేష చతుషష్టి పూజలు జరుగుతాయని ఈవో తెలిపారు. విశేష పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎల్టా జిల్లా కార్యవర్గం ఎన్నిక



వేణుగోపాలరావు (అధ్యక్షుడు)



రామ్మోహన్ (ప్రధాన కార్యదర్శి)

నిర్మల్ రూరల్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా అల్లూరి రామ్మోహన్, వ్యవస్థాపక అధ్యక్షుడిగా కడార్ల రవీంద్ర, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భూమన్నయాదవ్, జాయింట్ సెక్రెటరీగా లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రావు, ట్రెజరర్‌గా రతన్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మంత్రి ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా గంగామోహన్, సునీల్‌రెడ్డి, గంగా కిషన్, రాజేశ్వర్‌రెడ్డి, గణపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా నవీన్‌గౌడ్, గంగాధర్, తిరుమల్‌రెడ్డి, ముత్తన్న, రాహుల్, ఎర్రన్న, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాజేశ్వర్, మహిళా కార్యదర్శులుగా సంధ్యారాణి, లక్ష్మి, గీతారామచందర్, స్వాతి, విక్రాంతి, శైలజ ఎన్నికయ్యారు.

స్టడీ టూర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ రూరల్:విదేశాల్లో అమలవుతున్న విద్యావిధానాన్ని అధ్యయనం చేయడానికి జిల్లా నుంచి వెళ్లడానికి ఉత్సాహం ఉన్న ఉపాధ్యాయులు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు పేరెంట్స్ మీటింగ్..
జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 18న(శనివారం) పేరెంట్స్ సమావేశం నిర్వహించాలని డీఈవో భోజన్న తెలిపారు. ఆహ్వాన పత్రాలను తల్లిదండ్రులకు అందజేసి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎజెండాలోని అంశాలపై చర్చించాలన్నారు. ఈనెల 24 నుంచి ఎస్‌ఏ–2 పరీక్షలు ఉంటాయని, ప్రణాళిక ప్రకారం విద్యార్థులను చదివించేలా తల్లిదండ్రులకు సూచనలు చేయాలని తెలిపారు.

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

సోన్: జిల్లాలోని ఐదు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025– 26 సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకుల సంస్థ జిల్లా సమన్వయ అధికారి, లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షల ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్, కులం, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో సారంగాపూర్ మండలం జామ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు రావాలని సూచించారు.

మెప్మా.. ఓ అవినీతి కేంద్రం!

- ఆర్పీల నుంచి వసూళ్లు
- పలువురిపై వేధింపులు
- పీడీపై బాధితుల ఫిర్యాదులు
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు
- ప్రజాభవన్ నుంచి వస్తేనే స్పందన

నిర్మల్:పట్టణ పేదరిక నిర్మూలన చేయాల్సిన మెప్మాలో నిధులను మెక్కడం, అయినవారు తప్పులు చేసినా అందలం ఎక్కించడం ఆనవాయితీగా మారింది. ఇక్కడ అధికారి ఇష్టారీతిన వ్యవహరించినా.. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. అడిగేవారు లేకపోవడం జిల్లాలో ఉన్నతాధికారుల తీరుపైనా ఆరోపణలకు తావిస్తోంది. ఎక్కడో ఉన్న హైదరాబాద్‌లో ప్రజాభవన్ వరకు వెళ్తేగానీ.. జిల్లా ఉన్నతాధికారులు కనీస చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలూ వస్తున్నాయి. ఫిర్యాదులు చేసింది మహిళలైనా సరే.. సకాలంలో చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు మెప్మా పీడీ సుభాష్‌ను సంబంధిత శాఖకు సరెండర్ చేసినా.. ఈ విషయాన్ని జిల్లా అధికారులు అధికారికంగా వెల్లడించకపోవడం గమనార్హం. ఈ స్థాయిలో జిల్లా అధికారులు వెనుకేసుకు రావడంతో అసలు మెప్మా పీడీ వెనుక ఎవరెవరు ఉన్నారన్న అనుమానాలూ రేకెత్తుతున్నాయి.

ఆరోపణలు ఉన్నా..
మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్(మెప్మా) చేయాల్సింది పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన. ఇందుకు సంఘాల



మెప్మా కార్యాలయం

ద్వారా మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేలా చూడటం ప్రధాన ఉద్దేశం. కానీ.. నిర్మల్‌లో మెప్మా పేరిట అవినీతికి అందలం ఇచ్చారన్నది స్పష్టంగా తెలుస్తోంది. మహిళ సంఘాలకు చేదోడువాదోడుగా ఉండే రిసోర్స్‌పర్సన్ల నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున పీడీ సుభాష్ వసూలు చేసినట్లు ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. గతంలోనే ఈ ఆరోపణలను ఆధారాలతోసహా నిరూపించినా జిల్లా ఉన్నతాధికారులు లైట్ తీసుకున్నారు. అలాగే తనకు అనుకూలంగా ఉన్నవారు ఎన్ని తప్పులు చేసినా.. స్త్రీనిధిలో రూ.లక్షల్లో అవినీతికి పాల్పడినా.. వారికి క్యాంటీన్లు ఇవ్వడంలో ప్రాధాన్యత ఇచ్చినట్లు పీడీ సుభాష్‌పై ఆరోపణలు ఉన్నాయి. నిర్మల్ మున్సిపల్ గత పాలకవర్గం పీడీని తొలగించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రజావాణి టు ప్రజాభవన్..
మెప్మా పీడీ సుభాష్ అవినీతి, అక్రమ వసూళ్లు, వేధింపులపై కొన్నినెలల కిందటే బాధిత మహిళ సిబ్బంది ప్రజావాణిలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లారు. నెలలు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితులు హైదరాబాద్‌లో సీడీఎంఏ వరకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విచారణ చేపట్టినా నివేదికనూ నెలలపాటు ఆపేశారు. చివరకు చేసేదిలేక.. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వెళ్లి అక్కడ తమ గోడును వెల్లబోసుకుంటే అప్పుడు జిల్లాలో కదలిక వచ్చింది.

ఎందుకింత ప్రాధాన్యత..!?
వరుసగా అవినీతి ఆరోపణలు, వేధింపుల ఫిర్యాదులు, చివరకు మున్సిపల్ పాలకవర్గం ముక్తకంఠంతో మెప్మా పీడీని తీసేయాలంటూ విన్నవించినా జిల్లా ఉన్నతాధికారులు మెప్మా విషయంలో కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అసలు.. మెప్మా పీడీ వెనుక ఎవరెవరు ఉన్నారు.. అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రిసోర్స్‌పర్సన్లు చేసిన ఫిర్యాదుల విషయంలో ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి మధ్యవర్తిత్వం కోసం ప్రయత్నించడం, ఎంక్వైరీ కమిటీ విచారణ చేసినా నివేదికను సీడీఎంఏకు పంపడంలో జాప్యం చేయడం అనుమానాలకు తావిస్తున్నాయి. మరోవైపు సోమవారమే పీడీని సరెండర్ చేసినా అధికారికంగా వెల్లడించకపోవడంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చేయి తడిపితేనే అనుమతి

- బాణాసంచా వ్యాపారంలో వసూళ్ల బాంబులు
- ఒక్కో దుకాణం నుంచి రూ.23 వేల వరకు వసూలు

నిర్మల్‌చైన్‌గేట్:వెలుగుల పండుగ అయిన దీపావళికి ఇంకా నాలుగు రోజులే సమయం ఉంది. దీంతో టపాసుల దుకాణాల ఏర్పాటు పనులు వేగవంతమయ్యాయి. అయితే జిల్లాలో టపాసుల వ్యాపారానికి దళారుల బెడద ఇబ్బందిగా మారింది. దుకాణాల ఏర్పాటు, అనుమతుల పేరుతో కొందరు వ్యక్తులు వ్యాపారుల నుంచి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో దుకాణం కోసం రూ.23 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ''అన్ని శాఖల ఫార్మాలిటీలు మనమే చూసుకుంటాం'' అంటూ, ఇప్పటికే దళారులు వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకున్నారని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

ఖరీదైన వెలుగుల పండుగ
టపాసుల దుకాణాల ఏర్పాటుకు తోడు పోలీసులు, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, అగ్నిమాపక శాఖలకు ఎప్పటిలాగే ఖర్చులు తప్పడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల అమ్మకానికి ఒక్క దుకాణం కోసం రూ.40 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖర్చులు తుదకు వినియోగదారులపై పడే అవకాశముందని, టపాసుల ధరలు కూడా ఈసారి భారీగా పెరిగే ప్రమాదం ఉన్నట్లు సూచిస్తున్నారు. నిర్మల్‌లో ఏటా దీపావళికి సుమారు రూ.2 కోట్లకు పైగా విలువైన టపాసులు అమ్ముడవుతాయి. ఈసారి మాత్రం వ్యాపార ఖర్చులు పెరగడంతో ధరల భారమంతా ప్రజలపై పడే అవకాశం ఉంది.

అనుమతుల పేరిట..
జిల్లాలో ప్రతీ దీపావళికి తాత్కాలిక టపాసుల



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మిస్తున్న దుకాణాలు

మార్కెట్ ఏర్పాటు నియమిత ప్రక్రియగా మారింది. అయితే కొన్నేళ్లుగా కొందరు దళారులు గ్రూపులుగా ఏర్పడి ఈ ప్రక్రియను అదుపులోకి తీసుకున్నారు. ఒక దుకాణం సెటప్‌కి రూ.10 నుంచి రూ.12 వేల వ్యయం ఉంటే, అదనంగా అంతే మొత్తాన్ని 'సాయం' పేరుతో తీసుకున్నారని వ్యాపారులు చెబుతున్నారు. 60 దుకాణాల వరకు ఏర్పాటైనా, వాటిలో సగానికి మాత్రమే అధికారిక లైసెన్సులు ఫీజు చెల్లించి పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందరికీ చెల్లింపులు..
ఈ ఏడాది నిర్మల్ కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 65కి పైగా టపాసుల దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ప్రతీ దుకాణం పేరుతో రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక విభాగాలకు చెల్లింపులు చేయాల్సి వస్తోందని, అలాగే విద్యుత్, నీరు, భద్రతా సదుపాయాల పేరుతో అదనపు లెక్కలు చూపుతున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతేకాక, ఇప్పటికే లైసెన్సు పొందిన వ్యాపారులు తమ అనుమతులు తాత్కాలికంగా ఇతరులకు అమ్మి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకోకపోతే దళారుల ఈ దోపిడీ కొనసాగుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- డీఈవో భోజన్న

నిర్మల్‌టౌన్:విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని డీఈవో భోజన్న, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి, డీఈవో భోజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 చెస్, టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతాయని తెలిపారు. పోటీతత్వం అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల క్రీడల అధికారి భూక్య రమేశ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమన్న, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..
చెస్ అండర్–14 బాలికలు..
యాగశ్రీ(విన్నర్స్ ఒలంపియాడ్ పాఠశాల), శ్రీహర్షిణి(టీజీఆర్ జేసీ, సోఫీనగర్), శ్రీనిధి(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, జామ్), సహస్ర(అల్ఫోర్స్ హైస్కూల్), కనికశ్రీ(అల్ఫోర్స్ హైస్కూల్), విశాలి(విజయ హైస్కూల్).

అండర్–17 చెస్ బాలికల విభాగంలో...
లైబా కశ్యప్, చైత్ర(అల్ఫోర్స్ హైస్కూల్), శ్రావణి, ధరణిశ్రీ(విన్నర్స్ ఒలింపియాడ్), అద్వితి(టీజీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ, జామ్), మధుప్రియ(జెడ్పీహెచ్ఎస్ నర్సాపూర్(జి)) శ్రీదేవి(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, భైంసా).

అండర్ 14 చెస్ బాలురు..
నవదీప్(జెడ్పీహెచ్ఎస్, పెంబి) అంజిప్రసాద్(ఎస్ఆర్ ప్రైమ్)గణేశ్, హేమెందర్(జెడ్పీహెచ్ఎస్, నర్సాపూర్(జి)), ఆయుష్, సూర్యతేజ, సాయి కృష్ణ.

అండర్–17 చెస్ బాలుర విభాగంలో...
గజేందర్, అన్వేష్(ఎంజేపీ, జామ్), సాత్విక్(ఎంజేపీ, రాచాపూర్), హర్షిత్(ఎంజేపీ, నిర్మల్), రామ్‌చరణ్(జెడ్పీహెచ్ఎస్, పెంబి).



జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

టేబుల్ టెన్నిస్ విజేతలు..
అండర్–14 బాలికలు..
ఉమేజా, అన్విక, లితిక(అల్ఫోర్స్ హైస్కూల్), సహజ, సహస్ర, దీపిక(చాణక్య హైస్కూల్)

అండర్–17 బాలికలు..
ప్రణవి, శ్రీవెన్నెల(అల్ఫోర్స్ హైస్కూల్), వర్షిణి, వైష్ణవి, దివ్యశ్రీ(శాంతినికేతన్ హైస్కూల్).

అండర్–14 బాలురు..
ఫసియుద్దీన్, ఇర్షాదుల్లా, వేదాంత్(అల్ఫోర్స్ హైస్కూల్), త్రినయన్(విన్నర్స్ హైస్కూల్).

అండర్–17 బాలురు..
విశ్వనాథ్, ఆసిమొద్దీన్(అల్ఫోర్స్ హైస్కూల్), నిహాల్, యశస్విరాజ్, సిద్ధార్థ(విన్నర్స్ హైస్కూల్), మహేశ్(ఎంజేపీ, నిర్మల్) ఎంపికయ్యారు.

పంటల కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్

భైంసాటౌన్:ఖరీఫ్ పంటల కోతలు మొదలైన నేపథ్యంలో ఉత్పత్తుల కొనుగోళ్లకు అధికారులు సిద్ధంగా ఉండాలని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో గురువారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోయా, మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానున్నాయని తెలిపారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లకు కిసాన్ కపాస్ యాప్ అమలు చేస్తోందని, దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మహారాష్ట్ర నుంచి ఉత్పత్తులు రాకుండా నిఘా పెట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, రైతు నాయకుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్ ఫారూక్ అహ్మద్, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని రెవెన్యూ, వ్యవసాయ, ఆర్టీఏ, అగ్నిమాపక, పోలీస్, పీఏసీఎస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్:పోషణ మాసం ముగింపు వేడుకలు పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో గురువారం నిర్వహించారు. మాతా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు పోషణ మాసం ఎంతో ఉపయోగకరమన్నారు. నెల కార్యక్రమంగా కాకుండా, ప్రజల్లో నిరంతరం పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన పెంచేలా చర్యలు కొనసాగించాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారం అందుతోందని భరోసా కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 17న ప్రారంభమై అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాల నివారణపై అవగాహన కల్పించామన్నారు. బాల్యంలో పోషకాహార లోపం అధిగమిస్తే భవిష్యత్తులో పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగి, దేశ నిర్మాణానికి తోడ్పడతారన్నారు. కార్యక్రమాన్ని



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

విజయవంతంగా నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ శాఖకు సంబంధించిన సూచికల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారంపై నాటికలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు పోషకాహార స్టాళ్లను పరిశీలించి, టీచర్ల సృజనాత్మకతను ప్రశంసించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సీడీపీవోలు, సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి..

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, తక్కల రమణారెడ్డి, సత్యం చంద్రకాంత్, విలాస్, ఒడిసెల అర్జున్, సాగర్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మెరుగైన సేవలందించాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్:బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రజలకు బ్యాంకుల ద్వారా అందించిన రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై ఆయా శాఖల అధికారులతో కలిసి బ్యాంకర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొద్ది రోజులుగా బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న ఉపసంహరించుకోని నిధుల వివరాలను గుర్తించి, వారి సంబంధీకులకు, బ్యాంకు నియమాలు పాటిస్తూ, ఆ నగదును అందించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారులకు, విద్యార్థులకు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రామ్‌గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, ఎస్‌బీఐ ఆర్ఎం రామచంద్రరావు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

21 నుంచి పోలీస్ సంస్మరణోత్సవాలు

- మూడు భాషల్లో వ్యాసరచన పోటీలు
- షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీలోనూ..

నిర్మల్‌టౌన్: ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే) సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 31 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలోని విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తారు.

కార్యక్రమాలు ఇవీ..
ఈ 21 నుంచి 25 వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు చేపడతారు. ఇందులో భాగంగా పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, యాంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పోలీస్‌ల సేవలు, పోలీస్‌లు చేసిన ప్రతిభను ప్రజలకు తెలియజేస్తారు.

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు..
విద్యార్థులకు డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై ఆన్‌లైన్ వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో రాసే అవకాశం ఉంది. విద్యార్థులు తాము రాసిన వ్యాసాలను ఈ నెల 24లోపు https://forms.gle/jaWLdt2yhNrMpe3eA లింక్‌లో అప్లోడ్ చేయాలి. ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసి జిల్లా పోలీస్ కార్యాలయంలో బహుమతులు అందజేస్తారు. అత్యుత్తమంగా ఉన్న వాటిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు

పోలీసులకు..
కేటగిరీ–1లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి అధికారి వరకు పని ప్రదేశంలో లింగ వివక్షపై. కేటగిరీ–2లో ఎస్సై స్థాయి నుంచి పైస్థాయి అధికారులకు క్షేత్రస్థాయిలో పోలీసులు బలోపేతం చేయడంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషలలో నిర్వహిస్తారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు ప్రదానం చేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుంది.

షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు..
ఈ పోటీలలో విద్యార్థులు, యువత, ఫొటో, వీడియో గ్రాఫర్లు పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, పోలీసుల కీర్తి పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలి. ప్రతిభ కనబర్చిన మొదటి మూడు ఫొటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి, రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ప్రతిభ చాటుకోవాలి
సంఘ వ్యతిరేక శక్తులతో పోరాడే క్రమంలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ.. ఏటా పోలీస్ సంస్కరణ దినోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహిస్తుంటాం. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేసి, రాష్ట్రస్థాయికి పంపిస్తాం. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, పాత్రికేయులు పాల్గొని ప్రతిభ చాటుకోవాలి.
– జానకీషర్మిల, ఎస్పీ

పెన్షనరీ బెనిఫిట్స్ కోసం కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్:రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించేలా ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి, పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, లోలం గంగన్న , పోతారెడ్డి, కే రమేశ్, పి.జనార్దన్, బి.కిషన్‌రావు, పోతన్న, పోశెట్టి, వేణుగోపాల్, కే.రాములు, జాప రాములు, లక్ష్మణ్, రాజేశ్వర్, గంగాధర్, కరీం , హుస్సేన్, యూసుఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో పిచ్చిమొక్కల తొలగింపు



మార్కెట్ ఆవరణలో అడవిని తలపించేలా పెరిగిన మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్ వ్యాసాయ మార్కెట్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు, ఇతర సమస్యలపై 'సమస్యల మార్కెట్ యార్డ్' శీర్షికన సాక్షిలో గురువారం ఫొటో స్టోరీ ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు యార్డులోని పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. పరిసరాలను పరిశుభ్రం చేయించారు. మక్కల కొనుగోలుకు ఏర్పాట్లు చేయించారు. రైతులు తీసుకువచ్చిన మక్కలను కొనుగోలు చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



పిచ్చి మొక్కలను తొలగించిన తర్వాత ఇలా..

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం


గోపు భూమయ్య (ఫైల్)

సర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం దుబాయ్ వెళ్లిన మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రామానికి చెందిన గోపు భూమయ్య (42) నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామానికి చెందిన గోపు భూమయ్య దుబాయ్‌లోని సోనాపూర్ ప్రాంతంలో గల సీఆర్‌సీ కంపెనీలో ఏడాదిన్నరగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా యూఏఈ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో బొమ్మ ప్రవీణ్, బొడ్డుపల్లి రాము, గన్నారపు హన్మాండ్లు, శ్రీనివాస్ కంపెనీ యాజమాన్యం, పీఆర్వోలతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. గురువారం స్వగ్రామానికి మృతదేహం చేరడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలించి మండల కేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అటవీ శాఖ అధికారి పుండలిక్ రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌ను పట్టుకోగా గురువారం టైగర్‌జోన్ అధికారులు మరో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకే కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని దహెగాంలో అత్తాగారి ఊర్లో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కూతురు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 13న భార్యభర్తలు కూలీ పనులకు వెళ్లగా కూతురు కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును తలమడుగు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్లు వివరించారు.

కాసిపేట గని ఎదుట ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కాసిపేట: నీటిసమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా కాసిపేట గని ఎదుట గురువారం మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి, చిన్నధర్మారం, కాసిపేట గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, నిధుల కొరత అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్ మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాకీ కిరణ్, ప్రసన్న, మహిళలు పోసు, లచ్చక్క, కవిత, పద్మ, మహేశ్వరి, లక్ష్మి, యువకులు పాల్గొన్నారు.

విప్లవోద్యమం ఇక చరిత్రే!

- ఇప్పటికే ఎంతోమంది ఎన్‌కౌంటర్
- మరికొందరు లొంగుబాటు..
- మావోల శకం ముగిసినట్లే..?

బెల్లంపల్లి: పూర్వ పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయిస్టుపార్టీ విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. విప్లవ పంథాకు ఆకర్షితులైన ఎందరో యువతీ, యువకులు సమసమాజ స్థాపన కోసం నాలుగున్నర దశాబ్దాల క్రితం అడవి బాట పట్టారు. సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని దృఢంగా నమ్మి తల్లిదండ్రులు, తోబుట్టువులను వదిలి విప్లవమార్గం అనుసరించారు. నిరుపేద, కార్మిక, కర్షక కుటుంబాల నుంచి విద్యావంతులు, యువకులు ప్రాణత్యాగాలకు వెరవకుండా తుపాకి పోరాటంలో భాగస్వాములయ్యారు. అడవుల జిల్లా నలుమూలల పోరాట బీజాలు నాటి ఒకానొక దశలో సమాంతరంగా కార్యకలాపాలు సాగించారు. మందుపాతరలు పేల్చి పోలీసులను హతమార్చారు. కరువు దాడులు చేశారు. పోలీస్‌స్టేషన్లను టార్గెట్‌గా చేసి ఆయుధాల అపహరణకు సిద్ధపడ్డారు. నక్సలైట్ల ఏరివేతలో భాగంగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఎందరో అసువులు బాశారు. పచ్చటి అడవులు నెత్తుటేరులతో ఎరుపెక్కాయి. 1980 దశకం నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విప్లవ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఆతర్వాత పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుసాధించి పదుల సంఖ్యలో నక్సలైట్లను ఎన్‌కౌంటర్లలో హతమార్చారు.

జగిత్యాల జైత్రయాత్ర వెల్లువలో...

పీపుల్స్‌వార్ వ్యవస్థాపక ఆద్యుల్లో ముఖ్యుడైన కొండపల్లి సీతారామయ్య సారథ్యంలో జగిత్యాల జైత్రయాత్ర జరిగింది. ఆ పరిణామాల క్రమంలో 1978–79 ప్రాంతంలో బెల్లంపల్లికి చెందిన గజ్జెల గంగారాం, పెద్ది శంకర్, 1980, 81ప్రాంతంలో కటకం సుదర్శన్ విప్లవ భావజాలానికి ఆకర్షితులై అమరుడు నల్లా ఆదిరెడ్డి మార్గదర్శకంలో పీపుల్స్‌వార్ గ్రూప్‌ను విస్తరించారు. వీరి నేతృత్వంలో విప్లవ కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. అడవుల జిల్లా అంతటా పీపుల్స్‌వార్ వేళ్లూనుకుని బలీయమైన శక్తిగా రూపాంతరం చెందింది. విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేయడంలో బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, సిర్పూర్, తదితర ప్రాంతాలకు చెందిన ఎందరో కీలక భూమిక పోషించారు.

అమరత్వం... లొంగుబాటు...

విప్లవోద్యమంలో బెల్లంపల్లికి చెందిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం తొలి అమరులుగా చరిత్ర కెక్కారు. మొన్నటి జాడి వెంకటి వరకు విప్లవ ఆశయం సిద్ధించకుండానే నెత్తుటి బాటలో అనేకమంది నేలరాలారు. వ్యక్తిగత బలహీనతలు, అనారోగ్య సమస్యలు, పోలీసు నిర్బంధాన్ని తట్టుకోలేక వందలాది మంది జనజీవన స్రవంతిలో కలిశారు. పక్షం రోజుల క్రితం దండకారణ్యంలో పనిచేస్తున్న చెన్నూర్ ప్రాంతానికి చెందిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చయ్య, పద్మ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తాజాగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రెటరీగా పనిచేసిన బెల్లంపల్లికి చెందిన సలాకుల సరోజ ఉరఫ్ లత ఉరఫ్ దీప, ఆమె భర్త నిర్మల్ జిల్లా కూచన్‌పల్లి వాసి దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జి ఇర్రి. మోహన్‌రెడ్డి ఉరఫ్ వివేక్ గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఆయుధాన్ని అప్పగించి విప్లవ జీవితానికి ముగింపు పలికారు. వీరి లొంగుబాటు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం దాదాపు కనుమరుగైపోయినట్లేనని చర్చించుకుంటున్నారు.

అజ్ఞాతంలో ఉన్నది ఇంకెందరు?

సరోజ, మోహన్‌రెడ్డి దంపతుల లొంగుబాటు అనంతరం మావోయిస్టు పార్టీ విప్లవోద్యమంలో ప్రస్తుతం అజ్ఞాతంలో ఎందరున్నారనే చర్చ జరుగుతోంది. దండకారణ్యం కేంద్రంగా పనిచేస్తున్న మావోయిస్టుపార్టీ ముఖ్య నాయకుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (ఇతను కూడా ప్రభుత్వానికి లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది), మరో మావోయిస్టు అగ్రనాయకుడు కోటపల్లి మండలం బబ్బెర చెలక గ్రామవాసి మూల దేవేందర్ రెడ్డి, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప, బెల్లంపల్లి శాంతిఖని బస్తీకి చెందిన కృష్ణ, మరో యువకుడితో పాటు మరి కొంతమంది విప్లవ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మినహా ఉమ్మడి జిల్లాలో మరెవరూ అజ్ఞాతంలో లేనట్లుగా మాజీ మావోయిస్టులు, విప్లవ సానుభూతి పరులు పేర్కొంటున్నారు. పోలీసు రికార్డులకెక్కిన మావోయిస్టుల్లో దండకారణ్యంలో పనిచేస్తున్న వారు తప్పా ప్రస్తుతం భౌతికంగా ఏ ఒక్కరు లేనట్లుగా చెబుతున్నారు. ఈక్రమంలో నాలుగున్నర దశాబ్దాల పోరాట వారసత్వం కలిగిన ఉమ్మడి జిల్లా విప్లవ ప్రస్థానం ఇక చరిత్ర పుటలకు పరిమితం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తగా మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్ నిలిచి పోవడంతో ఉద్యమ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగ వేట ఇక సులభతరం

- నిరుద్యోగుల కోసం 'డీట్' యాప్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం



డీట్ వెబ్‌సైట్

బోథ్: డిజిటల్ యుగంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన 'డీట్' (డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిరుద్యోగులు, ప్రైవేటు రంగ సంస్థల మధ్య ప్రత్యక్ష వారధిగా ఈ యాప్ పనిచేయనుంది.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల సమన్వయంతో ఇది పర్యవేక్షించబడుతుంది. తద్వారా, అభ్యర్థులు తమ అర్హతలకు తగిన ప్రైవేటు రంగ ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. పరిశ్రమలు, నిరుద్యోగులు ఈ యాప్‌లో నమోదు చేసుకుంటే కంపెనీలు తమకు అవసరమైన, స్కిల్ ఉన్న వారికి సందేశాన్ని పంపిస్తారు. వందల కంపెనీలన్నీ ఒకే చోట ఉండటంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉటుంది.

అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు

డీట్ యాప్ ద్వారా పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఆపై చదివిన అభ్యర్థులు ప్రయోజనం పొందవచ్చు. వారి విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం ఆధారంగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం అదనపు విశేషం. ఫార్మా, ఇండస్ట్రియల్, బీపీవో, కస్టమర్ ఎగ్జిక్యూటివ్ సపోర్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు అనేక ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

- నిరుద్యోగులు, ఉద్యోగాలు కల్పించే ఔత్సాహిక కంపెనీలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.
- కంపెనీ నిర్వాహకులు, యాప్‌లో నమోదైన అభ్యర్థుల విద్య, నైపుణ్య వివరాలను పరిశీలించి, నేరుగా వారిని సంప్రదిస్తారు.
- కంపెనీల నియమావళిని బట్టి రాత లేదా మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఇందులో అవకాశం ఉండదు.

నమోదు విధానం

- నిరుద్యోగులు తమ పూర్తి వివరాలను డీట్ యాప్‌లో లేదా అధికారిక వెబ్‌సైట్ www.deet.telangana.gov.in లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా యాప్‌ను తెరవాలి.
- విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవం, ఇంటర్న్‌షిప్‌ల వివరాలు నమోదు చేయాలి.
- పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, అప్రెంటిస్‌షిప్‌లలో దేని కోసం అన్వేషిస్తున్నారో, ఏ రంగంలో ఉద్యోగం కావాలో స్పష్టం చేయాలి.
- విద్యార్హత పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

భార్యను కడతేర్చిన భర్త

- మద్యం తాగొద్దని మందలించిందని గొడ్డలితో నరికి హత్య
- ఆదిలాబాద్ జిల్లా సీతాగోందిలో ఘటన


రక్తపు మడుగులో లక్ష్మీబాయి మృతదేహం

గుడిహత్నూర్: మద్యం తాగొద్దని మందలించిన భార్యను గొడ్డలితో నరికి చంపిన సంఘటన మండలంలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతాగోంది గ్రామానికి చెందిన సిడాం సంతోష్, లక్ష్మీబాయి (35) దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సంతోష్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. గురువారం ఉదయం సైతం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తాగి మోటార్ సైకిల్ నడుపొద్దని లక్ష్మీబాయి మందలించింది. మద్యం మత్తులో ఉన్న సంతోష్ కోపంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె చెంప భాగంలో బలంగా కొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భార్యను హత్య చేశానని పోలీసులకు లొంగిపోయాడు. సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై అన్వర్

లక్సెట్టిపేట: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వావిలాల రమేశ్ (39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మంచిర్యాలకు వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య రజిని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వివాహిత..


మాధవి (ఫైల్)

బాసర: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ సాయికుమార్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హజిని గ్రామానికి చెందిన మాధవి (23)కి బాసర మండలంలోని దొడాపూర్ గ్రామానికి చెందిన కర్మానే మనోజ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలంగా మనోజ్ మద్యం సేవించి ఇంటికి వచ్చి అదనపు కట్నం తేవాలని మాధవిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన మహిళ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులతోనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..


బుచ్చన్న (ఫైల్)

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఒడ్డెపెల్లి గ్రామానికి చెందిన పల్లపు బుచ్చన్న (52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 13న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


సుధాకర్ (ఫైల్)

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భీమా సుధాకర్ (65) మృతి చెందాడు. గద్దెరాగిడిలోని ఓ కిరాణ దుకాణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో వేగంగా ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామ సమీపంలో స్థానిక రైతు నవీన్ రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (45) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తెల్లటి చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరికి పాము కాటు


వైశాలికి చికిత్స చేస్తున్న ఈఎంటీ అనిల్

బేల: మండలంలోని సిర్సన్న, జూనోని రెవెన్యూ గ్రామ శివారుల్లోని పొలాల్లో గురువారం ఇద్దరు రైతులు పాముకాటుకు గురయ్యారు. సిర్సన్న గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న బబన్‌కు, జూనోని గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న వైశాలిని వేర్వేరుగా పాములు కాటేశాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ అనిల్, పైలెట్ అర్షద్‌ఖాన్ బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత


కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు గురువారం రాత్రి 1000 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,178 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిజాయతీ చాటుకున్న సాయితేజ


బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన గొడిసెల సాయితేజగౌడ్ దొరికిన బ్యాగును లోకేశ్వరం పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. బుధవారం నిజామాబాద్ నుంచి పుస్పూర్‌కు బైక్‌పై వస్తున్న సాయితేజకు నందిపేట్ మండలం పలుగుగుట్ట సమీపంలో ఓ హ్యాండ్‌బ్యాగు దొరికింది. అందులో సెల్‌ఫోన్, రెండు గ్రాముల బంగారం, ఆధార్ కార్డు ఉంది. ఆధార్ ఆధారంగా నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ప్రవళికగా గుర్తించి లోకేశ్వరం పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. సుమారు రూ.40 వేల విలువైన వస్తువులను అప్పగించిన యువకుడిని పోలీసులు అభినందించారు. గురువారం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బ్యాగును అప్పగించారు.

డబ్బులు దండుకున్న మధ్యవర్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యవర్తిగా వ్యవహరిస్తూ కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చేలా చూస్తానని, పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేస్తానని డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. హైకోర్టులో జడ్జీలు, న్యాయవాదులు పరిచయం ఉన్నారని నమ్మబలికి బాధితుల నుంచి రూ.3 లక్షల 50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన ఫిర్యాదుదారు కుమారుడు, కోడలు మధ్య గొడవలు ఉన్నాయి. మధ్యవర్తిగా పరిచయం ఉన్న జైనూర్ మండలంలోని బూసిమెట్టకు చెందిన జాడే రవీందర్ బాధితులను నమ్మబలికి అందినకాడికి దండుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. మొదట రూ.3లక్షలు ఇవ్వగా ఆ తర్వాత కేసు నమోదు చేయిస్తానని బెదిరించి మరో రూ.50 వేలు తీసుకున్నాడు. డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడడంతో బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

42 కిలోల గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నమోదైన 18 కేసుల్లో పట్టుబడిన 42 కిలోల గంజాయిని గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలోని శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌లో గురువారం గంజాయి డిస్పోజల్ చేశారు. ఇందులో 22 కిలోల గంజాయి మొక్కలు, 20 కిలోల ఎండు గంజాయిని దహనం చేశారు. అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, డీసీఆర్‌బీ సీఐ హకీమ్ ఈ ప్రక్రియను పరిశీలించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ముఖేష్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల క్లబ్‌లో గురువారం నిర్వహించిన అండర్–14, 17, 19 బాలబాలికల జోనల్ స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో గ్రూపు నుంచి ఐదుగురు చొప్పున 30 మంది ఎంపికయ్యారు. అండర్–14 హైదరాబాద్, అండర్–17 మేడ్చల్, అండర్–19 మహబూబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పులూరి సుధాకర్, జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రేణి రాజయ్య, కుమురంభీం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘాలు విఫలం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని, ఇన్వాలిడేషన్ అయిన వారి స్థానంలో డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సమస్యలపై కొట్లాడటానికి వేదికలైన స్ట్రక్చర్ సమావేశాలు బహిష్కరించి ఇక్కడ గనులపై మెమోరాండాలు ఇస్తూ కార్మికులను ఆయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, ప్రవీణ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ వేణుచందర్

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముదిరాజ్ సంఘం పెద్దలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సమీపంలోని పత్తి చేను మీదుగావచ్చిన దుండగులు మొదట ఆలయం తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలో ఉన్న 4 కిలోల 500గ్రాముల వెండి, రూ. 36 వేల నగదు, అమ్మవారిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయంలో ఇంత పెద్దఎ త్తున వెండి ఉందన్న సమాచారం దొంగలకు ఎలా చేరిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మందు పార్టీ చేసుకుని దోపిడీ

చోరీకి పాల్పడిన దొంగలు మొదట సమీపంలోని పత్తి చేనులో మందు పార్టీ చేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పథకం ప్రకారం మొదట ఆలయ పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆలయం ఎదుటే నివాస గృహాలు ఉన్నప్పటికీ దుండగులు దోచుకుని యథేచ్ఛగా వెళ్లి పోవడం వెనుక స్థానికులు ఎవరైనా వారికి సహకరించారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్ల దూరంలోనే పోలీస్‌స్టేషన్

పోలీస్‌స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే చోరీ, జాతీయ రహదారికి సమీపంలోనే చోరీ జరగడం మండలంలో సంచలనంగా మారింది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ

సంఘటన స్థలాన్ని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ గురువారం సందర్శించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలు గాలించగా అది పత్తిచేనులోకి వెళ్లి ఆగిపోయింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ట్రయల్ పేరిట బైక్..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన సయ్యద్ రఫీక్ ఆటో కన్సల్టెన్సీ టూవీలర్ పర్చేజ్ అండ్ సేల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం బైక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ట్రయల్ కోసం బండిని కొంతదూరం వరకు తీసుకెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన లారీతో పోలీసులు


మృతి చెందిన పశువులు

బోథ్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న లారీని గురువారం సోనాల మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న లారీని ఆపి పరిశీలించగా అందులో పశువులు కనిపించాయి. లారీలో 26 పశువులు ఉండగా రెండు మృతి చెంది ఉన్నాయి. వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను బజార్ హత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. లారీ ఓనర్‌తో పాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.